మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 07    సంచిక : 352    శనివారం    10 - 05 - 2025    పేజీలు: 8    వెల: 4

## అమరవీరుడికి సీఎం ఘన నివాళి



7లో..



## ఏటీఎం, డిజిటల్ సేవలు యథాతథం

మన గళం, న్యూఢిల్లీ : భారత్–పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, దేశంలో ఏటీఎంలు మూతపడతాయంటూ సామాజిక మాధ్యమాల్లో కొన్ని తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఈ వార్తలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) సహా దేశంలోని అగ్రశ్రేణి 2లో..

## ఇండియాలో వాటిని టార్గెట్ చేశాం



మన గళం, న్యూఢిల్లీ : మే 8, 9 తేదీల మధ్య రాత్రి జరిగిన ఘర్షణల సమయంలో భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అంగీకరించారు. భారత భూభాగంపై పాకిస్తాన్ చేసిన వరుస క్షిపణి, డ్రోన్ దాడుల తర్వాత ఈ ప్రకటన 2లో..

# దేశాన్ని రక్షించే శక్తి మోదీ..



- దేశం యుద్ధ వాతావరణాన్ని ఎదుర్కొంటోంది
- ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశానికి భద్రత అన్న చంద్రబాబు
- ఉగ్రదాడులతో దేశం దిగ్భ్రాంతికి గురైంది
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మన గళం, అమరావతి : ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అని చంద్రబాబు అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని చాయాపురంలో నేడు ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం ఒకరకమైన యుద్ధ వాతావరణాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. ఉగ్రవాదుల దాడులతో దేశ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గామ్‌లో అమాయకులైన మన వారిని ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ప్రపంచంలో ఎక్కడా హింసకు తావులేదని ప్రధాని పదేపదే స్పష్టం చేస్తుంటారని గుర్తుచేశారు.

పాకిస్థాన్ నిరంతరం మన దేశంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, దాడులు చేస్తోందని ఆయన మండిపడ్డారు. దేశ రక్షణ కోసం ఎంతో మంది యువకులు సైన్యంలో చేరుతున్నారని, వారి త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, ఉగ్రవాదులతో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన తెలుగు బిడ్డ, సైనికుడు మురళీ నాయక్ గురించి ప్రస్తావిస్తూ, ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మురళీ నాయక్ తల్లిదండ్రులతో తాను మాట్లాడి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశానని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.



ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. అనంతరం, చంద్రబాబు "భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు చేశారు.



## పాక్ బంకర్లు వీటి ముందు ఆగలేవు!

### భారత్ వద్ద నాగ్, ధ్రువాస్త్ర వంటి ఏటీజీఎంలు సిద్ధం

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో వివిధ రకాల ఆయుధాల గురించి ప్రజల్లో ఆసక్తి కలుగుతోంది. ఇక భారత్ వద్ద ఉన్న ఆయుధాల్లో... యుద్ధ 2లో..

## ఉన్నతాధికారులతో రక్షణ మంత్రి కీలక భేటీ



2లో..

మన గళం డెస్క్ : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత్ లక్ష్యంగా డ్రోణులు, క్షిపణులతో పాకిస్థాన్ దాడి చేస్తోంది. ఈ దాడులను భారత్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది. అలాంటి వేళ.. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన శుక్రవారం

# స్టేడియం పేల్చేస్తాం

### పాక్ స్లీపర్ సెల్స్ ద్వారా దాడులు చేస్తామని హెచ్చరిక.. స్టేడియంలో తనిఖీలు

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత అరుణ్ జైట్లీ స్టేడియంకు బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి శుక్రవారం ఉదయం ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)కు ఈ మేరకు ఒక ఈ–మెయిల్ అందింది. దాడులకు పాల్పడతామని, ఇందుకోసం భారత్ వ్యాప్తంగా పాకిస్థాన్‌కు విధేయులైన స్లీపర్ సెల్స్ సిద్ధంగా



2లో..

# మీ ఆవేదన తీర్చలేనిది

### - మురళీనాయక్ ఫ్యామిలీకి సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పరామర్శ

మన గళం, అమరావతి : భారత్ – పాకిస్థాన్ యుద్ధ భూమిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీ నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.



2లో..



## జగన్‌కు హైకోర్టులో నిరాశ

### – 'జెడ్ ప్లస్' కేటగిరీ భద్రత పునరుద్ధరించాలన్న జగన్.. విచారణ వాయిదా

మన గళం, అమరావతి : ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హైకోర్టులో నిరాశ ఎదురైంది. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ ఆయన గురువారం ఏపీ హైకోర్టులో పిటిషన్ 2లో..





## పాకిస్థాన్ సైబర్ అటాక్

### – వాట్సాప్ కు ఈ మెసేజ్ లు వస్తే ఓపెన్ చేయకండి!

మన గళం డెస్క్ : భారతదేశంలో ఇంటర్నెట్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ సైబర్ నేరగాళ్లు మరోసారి అటాక్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' అనే పేరుతో ఒక ప్రమాదకరమైన మాల్‌వేర్‌ను వ్యాప్తిలోకి తెచ్చి, దేశ ప్రజల వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు తదితర సున్నితమైన డేటాను తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని భారత సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వాట్సాప్ ద్వారా 2లో..



# ఏటీఎం, డిజిటల్ సేవలు యథాతథం



మొదటి పేజీ తరువాయి

బ్యాంకులు తీవ్రంగా ఖండించాయి. తమ ఏటీఎంలతో పాటు అన్ని డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో, సజావుగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశాయి. ఎస్‌బీఐ తమ అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా, "మా అన్ని ఏటీఎంలు, క్యాష్ డిపాజిట్ మెషీన్లు మరియు డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ప్రజల వినియోగానికి అందుబాటులో ఉన్నాయని" పేర్కొంది. ధృవీకరించని సమాచారంపై ఆధారపడవద్దని వినియోగదారులకు విజ్ఞప్తి చేసింది. పీఎన్‌బీ కూడా తమ సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, డిజిటల్ సేవలు సజావుగా పనిచేస్తున్నాయని తెలిపింది. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ఇతర బ్యాంకులు కూడా ఇదే విధమైన హామీ ఇచ్చాయి. మరోవైపు, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తోసిపుచ్చింది. దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా మార్గాలు సజావుగా పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. అనవసరంగా కొనుగోళ్లు చేయవద్దని, ఇంధనం, ఎల్‌పీజీ అన్ని అవుట్‌లెట్లలో సులభంగా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా, దేశంలో ఆహార ధాన్యాలు లేదా ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) భరోసా ఇచ్చింది. అన్ని వస్తువులు మార్కెట్లలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం వద్ద కూడా తగినన్ని నిల్వలు ఉన్నాయని పేర్కొంది. సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ, వ్యాపారులు దేశ సరఫరా వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూస్తారని హామీ ఇచ్చారు.

# ఇండియాలో వాటిని టార్గెట్ చేశాం

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఆకాశ్ ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణితో సహా భారతదేశ వైమానిక రక్షణ వ్యవస్థలు వీటిని అడ్డుకున్నాయి. గురువారం రాత్రి నియంత్రణ రేఖ(ఎల్‌ఓసి), అంతర్జాతీయ సరిహద్దులు (ఐబి) వెంబడి పెద్ద ఎత్తున కౌంటర్-డ్రోన్ ఆపరేషన్ సందర్భంగా భారత సైన్యం 50కి పైగా పాకిస్తానీ డ్రోన్‌లను కూల్చివేసినట్లు సమాచారం. వివిధ ప్రదేశాలలో భారత భూభాగంలోకి బహుళ స్వార్మ్ డ్రోన్‌లను పంపడానికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలు విఫలమైన తర్వాత ఈ ఆపరేషన్ ప్రారంభించింది. భారత ఆర్మీ వైమానిక రక్షణ విభాగాలు వేగంగా స్పందించి ఉధంపూర్, సాంబా, జమ్మూ, అఖ్నూర్, నగ్రోటా, పఠాన్‌కోట్ వంటి ప్రాంతాలలో డ్రోన్‌లను లక్ష్యంగా చేసుకున్నాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్ ఉపరితలం నుండి గగనతల క్షిపణి వాయు రక్షణ వ్యవస్థ గురువారం భారత ఆస్తులను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ డ్రోన్ దాడులను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిందని అధికారులు తెలిపారు. మే 8, 9 తేదీల మధ్య రాత్రి భారత సైన్యం జమ్మూ కశ్మీర్‌లోని పశ్చిమ సరిహద్దు, నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి పాకిస్తాన్ చేసిన బహుళ డ్రోన్ దాడులను విజయవంతంగా తిప్పికొట్టి, ప్రతిస్పందించింది. భారత సైన్యం, వైమానిక దళం రెండూ పాకిస్తాన్ సరిహద్దులో క్షిపణి వ్యవస్థను మోహరించాయని అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 1:05 నుండి 1:30 గంటల మధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సమన్వయంతో పాకిస్తాన్‌లోని జెఎం, ఎల్ఇటి స్థావరాలు, పిఓకె వంటి కీలక భవనాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22న 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన కొన్ని రోజుల తర్వాత భారత్ ఈ సైనిక చర్యకు దిగింది. కేవలం ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది కానీ, పాక్ సామాన్య పౌరులకు, సైనికులకు ఎలాంటి నష్టం చేయలేదు. అయినా పాకిస్థాన్ సరిహద్దు వెంబడి భారత పౌరులపై కాల్పులకు తెగబడింది.

# స్టేడియం పేల్చేస్తాం

మొదటి పేజీ తరువాయి




ఉన్నాయని హెచ్చరించినట్లు సమాచారం. ఈ స్టేడియం ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు హోం గ్రౌండ్‌గా ఉండగా, మే 11న ఇక్కడ ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే, టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు బీసీసీఐ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ బెదిరింపు ఈ-మెయిల్ అందిన విషయాన్ని డీడీసీఏ ఉన్నతాధికారి ఒకరు ధృవీకరించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా డాట్ కామ్‌తో మాట్లాడుతూ, "అవును, ఈ ఉదయం మాకు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దానిని వెంటనే ఢిల్లీ పోలీసులకు పంపాము. వారు ఇప్పటికే రంగంలోకి దిగి, స్టేడియాన్ని తనిఖీ చేశారు" అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ పోలీసులు స్టేడియం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసి, బెదిరింపు ఈ-మెయిల్ మూలాలపై దర్యాప్తు చేస్తున్నారు. భద్రతా వర్గాలు అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతున్నాయి.

# మీ ఆవేదన తీర్చలేనిది

మొదటి పేజీ తరువాయి

మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళి త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వీరజవాన్ మురళి తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిదని.. వారు ధైర్యంగా ఉండాలని కోరుతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి మరణించిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారన్నారు. ఈ వీరుడి తల్లితండ్రులు జ్యోతి బాయి, శ్రీరామ్ నాయక్, ఇతర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# పాక్ బంకర్లు వీటి ముందు ఆగలేవు!

ట్యాంకులు, శత్రు స్థావరాలు, బంకర్లను లక్ష్యంగా చేసుకుని యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైళ్లు (ఏటీజీఎం) ముఖ్యమైనవి. ఈ అత్యాధునిక అస్త్రాలు భారత సైనిక పాటవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (ఏటీజీఎం) ప్రధానంగా శత్రువుల యుద్ధ ట్యాంకులు, పటిష్టమైన కవచాలు కలిగిన సైనిక వాహనాలు, బంకర్లను ధ్వంసం చేయడానికి రూపొందించిన శక్తివంతమైన క్షిపణి. దీనిని ప్రయోగించిన తర్వాత, అది స్వయంచాలకంగా లక్ష్యాన్ని గుర్తించి, అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తుంది. సైనికులు భుజంపై నుంచి, ట్రైపాడ్‌పై అమర్చి లేదా వాహనాలపై నుంచి కూడా దీనిని ప్రయోగించవచ్చు. సురక్షిత దూరం నుంచే శత్రు స్థావరాలను నిర్వీర్యం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. చాలా ఏటీజీఎంలలో 'షేప్డ్ ఛార్జ్' సాంకేతికత ఉంటుంది. ఇది పేలుడు శక్తిని ఒకే బిందువుపై కేంద్రీకరించి, ఎంతటి మందపాటి కవచాన్నైనా చీల్చుకుపోయేలా చేస్తుంది. కొన్ని క్షిపణులలో 'ట్యాండమ్ వార్‌హెడ్' వ్యవస్థ ఉంటుంది. ఇది రెండు దశల్లో పేలి, రక్షణ కవచాలను ఛేదించి అసలు లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. భారత సైన్యం వద్ద దేశీయంగా అభివృద్ధి చేసిన 'నాగ్' (భూమి పైనుంచి ప్రయోగించేది), 'ధ్రువాస్త్ర' (గతంలో హెలీనా - హెలికాప్టర్ నుంచి ప్రయోగించేది) వంటి అత్యాధునిక ఏటీజీఎంలు సిద్ధంగా ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా, అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ ఇవి లక్ష్యాలను ఛేదించగలవు.

# జగన్‌కు హైకోర్టులో నిరాశ



దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం... తదుపరి విచారణను వేసవి తర్వాతకు వాయిదా వేసింది. తనకు ఉన్న ప్రాణహాని దృష్ట్యా సీఆర్‌పీఎఫ్ లేదా ఎన్‌ఎస్‌జీలతో సెక్యూరిటీ కల్పించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని జగన్ అభ్యర్థించారు. తన నివాసం, కార్యాలయం వద్ద పటిష్టమైన భద్రతతో పాటు, జామర్లు, పూర్తిస్థాయిలో పనిచేసే బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చాలని కోరారు. అయితే, కేంద్రం పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తనకు తగిన భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోర్టును విన్నవించారు. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఎలాంటి ముందస్తు సమాచారం గానీ, నోటీసు గానీ ఇవ్వకుండా తన భద్రతను భారీగా తగ్గించేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉన్నతాధికారులతో రక్షణ మంత్రి కీలక భేటీ

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీలో కీలక భేటీ జరిగింది. ఈ భేటీకి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర దివ్వేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ హాజరయ్యారు. ఈ సమావేశంలో దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో 26 మంది మరణించారు. ఈ దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందంనేందుకు కీలక సాక్ష్యాలను భారత్ సంపాదించింది. వాటిని ప్రపంచ దేశాల ముందు ఉంచిది. అలాగే పాకిస్థాన్‌పై భారత్ కీలక ఆంక్షలు విధించింది. ఆ క్రమంలో మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థలను నేలమట్టం చేశారు భారత్ సైనికులు. ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రవాదులు మరణించినట్లు తెలుస్తోంది.

అందుకు ప్రతిగా పాకిస్థాన్ సైతం మే 8వ తేదీన ఇరుదేశాల సరిహద్దు వెంట ఉన్న నగరాలు.. జమ్మూ, పఠాన్‌కోట్, ఉదంపూర్ తదితర ప్రాంతాలపైకి డ్రోణులు, క్షిపణులతో దాడులకు దిగింది. వీటిని భారత్ తిప్పికొట్టింది. దేశ సార్వభౌమత్వాన్ని, దేశ ప్రజలను కాపాడడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# పాకిస్థాన్ సైబర్ అటాక్

మొదటి పేజీ తరువాయి



ఈ వైరస్‌ను చొప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసు విభాగం సూచించింది. పాకిస్థానీ హ్యాకర్లు భారతీయ సోషల్ మీడియా యూజర్లపై ప్రభావం చూపేందుకు, వారి నుంచి కీలక సమాచారాన్ని సేకరించేందుకు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' మాల్‌వేర్‌ను ప్రయోగిస్తున్నట్లు సమాచారం. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే వాట్సాప్ సందేశాలు, లింకుల ద్వారా ఈ మాల్‌వేర్‌ను ఫోన్లలోకి చొప్పించి, సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. వాట్సాప్‌తో పాటు ఫేస్‌బుక్, ఈమెయిల్స్ ద్వారా కూడా ఈ వైరస్‌ను వ్యాపింపజేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' మాల్‌వేర్ ఫోన్‌లోకి ప్రవేశిస్తే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించవచ్చని వారు హెచ్చరించారు. ఫోన్‌లోని రహస్య ఫైళ్లను యాక్సెస్ చేసి, వాటిని లీక్ చేసే ప్రమాదం ఉందని చెప్పారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వేగాన్ని తగ్గించడం లేదా పూర్తిగా క్రాష్ చేయడం చేయవచ్చని తెలిపారు. మన పరికరాలను రిమోట్‌గా వారి ఆధీనంలోకి తీసుకుని దుర్వినియోగం చేయవచ్చని హెచ్చరించారు.

శనివారం
10 - 05 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రధానం



మన గళం,కర్నూలు సిటి : కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ లో సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాలను పురస్కరించుకొని ఆట పాట మాట, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమం శ్రీరామ నగర్ లోని శివాలయం దగ్గర జరిగింది.కార్యక్రమానికి సిపిఎం పార్టీ నగర నాయకులు సి.శేషాద్రి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వైద్యులు ఈఎన్టి స్పెషలిస్టు ప్రొఫెసర్ డాక్టర్ఎం మహేంద్ర కుమార్ సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప గార్లు బహిరంగ సభకార్యక్రమానికి విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేయడమే పనిగా పెట్టుకుని ఇంటి పన్ను కరెంటు చార్జీ నిత్యవసర వస్తువుల ధరలు పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు బస్సు చార్జీలు రైల్వే చార్జీలు పెంచి ప్రజల పైన మోయలేని భారాలు వేస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయి ప్రజలు పనులు లేక పొట్టకూటి కోసం వలసలు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉన్నది. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లనుతీసుకువచ్చి యజమానులకు అనుకూలంగా చట్టాలను చేస్తున్నాయి. ఉపాధి అవకాశాల కోసం పని భద్రత కోసం లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనాలు అమలు చేయాలని భారత దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఈనెల 20వ తారీఖున దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ వైద్యులు ఈఎన్టీ స్పెషలిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం మహేంద్ర కుమార్ గారు మాట్లాడుతూ సి క్యాంపు మున్సిపల్ అప్పర్ ప్రైమరీ హైస్కూల్ హుస్సేన్ అప్ప హై స్కూల్ విజేత స్కూల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. విద్యార్థులు పదవ తరగతి నుండి తమ యొక్క టార్గెట్ ను నిర్ణయించుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి ప్రణాళికలను వేసుకొని ముందుకు సాగాలని పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు సాధించాలని విద్యార్థులు సెల్లు ఫోన్లకు దూరంగా ఉంటూ అవసరం మేరకే సెల్లును ఉపయోగిస్తూ మంచి విషయాలను తెలుసుకుంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులపై ప్రభుత్వంశ్రద్ధ పెట్టి చేయూతనిచ్చి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చే విధంగాప్రభుత్వతోడ్పాటునుఅందించాలని ఆయన కోరారు సిఐటియు కమిటీ వారు ఇంత మంచి ప్రోగ్రామ్ నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించినందుకు వారికి ధన్యవాదాలు అన్నారు. సి క్యాంప్ స్కూలు సోషల్ మాస్టర్ ఎం ఆనంద్ గారు మాట్లాడుతూ సికాం స్కూల్లో విద్యార్థులకు మంచి విద్యను అందించడంలో మా స్కూలు ఉపాధ్యాయులు అందరూ కూడా కష్టపడి విద్యార్థుల్లో మంచి ఫలితాలు సాధించేలాగా కృషి చేస్తున్నామని భవిష్యత్తులో కూడా అదేవిధంగాకృషిచేస్తామనిఅన్నారు అనంతరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు ఎల్లా గౌడ్ మునిస్వామి నరసింహ జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు సుధీర్ కుమార్సిఐటియునగరనాయకులు ఎస్ఎండి మహమ్మద్ రఫీ కే సుధాకరప్ప జి ఏసు కే ప్రభాకర్ సిపిఎం వార్డు నాయకులు,అజ్మత్ వై.జాన్సన్ పి. బాబురావు టి శ్రీనివాసులు ఆర్. రాజు ఏ స్వాములు రాజు మహిళా సంఘం వార్డు నాయకులు కే నాగజ్యోతి ఆర్ నలిని సుజాత లక్ష్మి దేవి కే శాంతి మొదలగు వారు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ లో వరి క్రయ,విక్రయాలు



మన గళం,కర్నూలు మార్కెట్ యార్డ్ : కర్నూలు మార్కెట్ యార్డులో వరి ధాన్యం పంట ఉత్పతుల యొక్క క్రయవిక్రయాలు ప్రతి రోజు కొనసాగుతున్నట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరి జయలక్ష్మి తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని ఆమె చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యాపారస్థులు,రైస్ మిల్లర్లు మార్కెట్ యార్డును సంప్రదించి లైసెన్సు పొంది క్రయవిక్రయాల్లో పాల్గొనవలసిందిగా ఆమె కోరారు.

# ముస్లిం సోదరుల సమావేశం



మన గళం,కర్నూలు పాతబస్తీ : ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ,సేవ్ వక్ఫ్ జాయింట్ ఆక్షన్ కమిటీ సయ్యద్ మన్సూర్ మౌలానా అధ్యక్షతన రిసల్దార్ మసీద్ లో శుక్రవారం సమావేశం జరిగింది.ఈనెల 21వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కర్తవ్యాలపై చర్చిస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సయ్యద్ జాకీర్ మౌలానా రషది తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కర్నూలు నంద్యాల ,జిల్లాల ముఖ్య నాయకులతో పాటు, వివిధ మండలాల, తాలూకా నాయకుల, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం సజరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తదుపరి కార్యక్రమాలు రౌండ్ టేబుల్ లో చర్చించి భవిష్యత్తు ప్రణాళికను విడుదల చేస్తామని వారు తెలియజేశారు ఈ సమావేశంలో కో కన్వీనర్లు, ఎం ఏ హమీద్, మౌలానా జబీవుల్లా, మౌలానా ముస్తాక్ అహ్మద్ ఖాన్ హఫీస్ హుస్సేన్ సాహెబ్, హఫీజ్ చాంద్ బాషాఎస్ ఎం డి షరీఫ్, అబ్దుల్ రహిమాన్,జహంగీర్, మునీర్ అహ్మద్, ఖాజీ ఖలీద్, తదితరులు పాల్గొన్నారు.

# 340 సి రోడ్డు వెడల్పునకు భూమి యజమానులు సహకరించాలి

**- మే 16 లోపల యజమానులు వారి డాక్యుమెంట్లు సమర్పించాలి**

**- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య**



మన గళం,కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరం నుంచి వెళ్లే 2.3 కిలోమీటర్ల పొడవైన నంబర్ 340- సి రోడ్డు వెడల్పు చేయు కార్యక్రమానికి సంబంధించిన భూ యజమానులు మున్సిపల్ కార్పొరేషన్ కు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య కోరారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ హాల్ సమావేశం మందిరంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుండి నందికొట్కూరు రోడ్డు లో శ్రీ సాయి గార్డెన్స్ వరకు రోడ్డు వెడల్పులో ప్రభావితమయ్యే భవన మరియు స్థలము యజమానులతో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం జరిగిన సమావేశం లో మీ అందరి కోరికపై 120 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డును 100 అడుగుల రోడ్డుగా మార్చడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడం జరిగిందని, కావున భవన , స్థలం యజమానులు వెంటనే తమకు సంబంధించిన డాక్యుమెంట్లను మున్సిపల్ కార్పొరేషన్ కి అందించి మున్సిపల్ అధికారులకు కు సహకరించాలని కోరారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన రివైజ్డ్ వాల్యుయేషన్ ( సబ్ రిజిస్టర్ కార్యాలయం వారి వాల్యుయేషన్ ) ప్రకారం ఖాళీ స్థలానికి టిడిఆర్ బాండ్ల రూపంలో మరియు భవనాలకు వాటి ప్లింత్ ఏరియా ను బట్టి ఆర్ అండ్ బి విభాగం వారు చేసే వ్యాల్యూషన్ బట్టి నగదు చెల్లించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ భూ యజమానులకు తెలియజేశారు. మే 16 లోపల యజమానులు వారికి సంబంధించిన డాక్యుమెంట్స్ ని సమర్పించినట్లయితే వాటిని వెంటనే స్క్రూటీనీ చేసి అప్రూవల్ చేయడం జరుగుతుందని , తదుపరి సర్వే చేసి రోడ్డును నిర్మించడం కూడా జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. యజమానులు వీలైనంత త్వరగా డాక్యుమెంట్లను మున్సిపల్ కార్పొరేషన్ కు అందజేసి సహకరించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా కొంతమంది యజమానులు అడిగిన సమస్యలకు జాయింట్ కలెక్టర్ సమాధానమిచ్చారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ భూమి యజమానులకు అనుకూలంగా ప్రభుత్వాన్ని 100 అడుగుల వెడల్పు ఉండే విధంగా ఒప్పించడం జరిగిందని కావున వెంటనే సంబంధిత డాక్యుమెంట్లు కార్యాలయానికి ఆలస్యం లేకుండా అప్పగించి సహకరించవలసిందిగా కోరారు. ఇంతవరకు 90 మంది డాక్యుమెంట్లు సమర్పించారని, మిగిలిన వారు వెంటనే సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. భూ యజమానుల అనుమానాలు , సమస్యలను సహృదయంతో పరిష్కరిస్తామని,ఎటువంటి అనుమానాలు లేకుండా డాక్యుమెంట్స్ ని సమర్పించినట్లయితే వేగంగా మిగిలిన పనులు చేస్తామని కమిషనర్ తెలియజేశారు. ఈ సమావేశానికి టౌన్ ప్లానింగ్ అధికారి ప్రదీప్ కుమార్ , భూ యజమానులు పాల్గొన్నారు.

# పూడికతీత పనులు పకడ్బందీగా చేపట్టాలి



**- నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు**

మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : నగరంలోని 52 వార్డుల్లో చేపట్టిన పూడికతీత పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెద్దపడఖాన, దండెగేరి, తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని అందించేందుకు చర్యలు చేపట్టామని, అందులో భాగంగా రూ.1.06 కోట్లతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి వార్డులో 15 మందికి పైగా ప్రత్యేక సిబ్బందితో ప్రధాన మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయని వెల్లడించారు. అలాగే సుద్దవాగులో తొలి దశ పూడికతీత పనులు పూర్తి అయ్యాయని, కెసి కెనాల్లో సైతం పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామన్నారు. నగర ప్రజలు నగరపాలకకు సహకరించాలని, వ్యర్థాలను మురుగు కాలువల్లో, నదుల్లో వేయొద్దని, వాటిని పారిశుద్ధ్య సిబ్బందికే అప్పగించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కురుబ పరమేష్, డిఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ మహేష్, శానిటేషన్ ఇంస్పెక్టర్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

# వివాహ కార్యక్రమాలకు హాజరైన నేత కాటసాని



మన గళం,కల్లూరు : శుక్రవారం పాణ్యం నియోజకవర్గం పరిధిలో జరిగిన పలు వివాహ మహోత్సవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైన్ షాప్ లపై చర్యలు తీసుకోవాలి

**- డివైఎఫ్ఐ నేతల డిమాండ్**




మన గళం,కర్నూలు సిటి : కర్నూలు జిల్లాలోని ఎక్సైజ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైన్ షాప్ లపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైన్ షాపులు విచ్చలవిడిగ సమయపాలన పాటించకుండా ఉదయం నుండి రాత్రి 11 గంటల వరకు, వయసుతో సంబంధం లేకుండా చిన్నపిల్లలకి సైతం వైన్ విక్రయించడం జరుగుతుంది, వైన్ షాపుల ముందు గుంపులు గుంపులుగా చేరి రోడ్లు మొత్తం బ్లాక్ చేస్తున్న ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. అలాగే కేసులు కేసులు ఒకే పర్సన్ కి అమ్మడం ద్వారా వారు అక్రమంగా గ్రామీణ ప్రాంతాల్లోన వైన్ షాపులు లేని లేబర్ ఏరియాలలో విచ్చలవిడిగా వారికి నచ్చిన రేట్ కి విక్రయిస్తున్నారు. దీనికి కారణం వైన్ షాపులు అనధికారికంగా అమ్మేవారికి వైన్ బాటిల్స్ ను సప్లై చేయడమే కాబట్టి జిల్లా ఎక్సైజ్ అధికారులు వైన్ షాప్ ల నిర్వహణపై వెంటనే పరిశీలించి ప్రభుత్వ నిర్బంధనలను తుంగలో తొక్కి వారికి ఇష్టం వచ్చినట్టు లాభార్జనే ధ్యేయంగా నిర్వహిస్తున్న వాటిపై మరియు అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎక్సైజ్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు.

## కూలిన చెన్న- సూరత్ హైవే సొరంగమార్గాన్ని పరిశీలించిన సిపిఎం బృందం



మన గళం,కర్నూలు సిటి : కర్నూలు రింగ్ రోడ్డు దగ్గర కూలిన చెన్నై - సూరత్ హైవే సొరంగమార్గం ను శుక్రవారం సిపిఎం ప్రతిది బృందం పరిశీలించి ప్రమాదానికి గల కారణాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొరంగ మార్గం వద్ద కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. దాదాపు 45 మీటర్ల లోతు ఉన్న ఈ సొరంగ మార్గం ఒక్కసారిగా కుప్పకూలడంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. సొరంగ మార్గమనేది అందం కోసం కాదని అవసరం కోసం అన్నారు. సొరంగ మార్గం పోతున్న ప్రాంతం, పైనున్న మట్టి ఏ రకమైనది అని అంచనా వేసి, ఎంత లోతులో తీయాలో అన్నది నిర్దేశించాలన్నారు. రింగ్ రోడ్డు ముందు నుండి మరింత ముందుకెళ్తే, గట్లు, ఇళ్ల క్రింద పోతుందనే విషయం తెలిసిందని, ఇప్పటికైనా సరైన అంచనా తో ప్రమాద తీవ్రత పెరగకుండా నిర్మాణం చేపట్టాలని, ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్ మరియు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సొరంగ మార్గం కూలడంతో కర్నూలు - బెంగుళూరు జాతీయ రహదారిపై భారీ గొయ్యి ఏర్పడిందని, ప్రమాద తీవ్రతను గుర్తించిన పోలీసులు వెంటనే ట్రాఫిక్ ను మళ్లించి ప్రయాణికులు ప్రమాదపు అంచుల్లోకి వెళ్లకుండా కాపాడారన్నారు . సొరంగ మార్గం కూలడంతో దాదాపు 8 గంటలకు పైగా ట్రాఫిక్ అంతరాయం జరిగిందన్నారు. సొరంగ మార్గం కూలిన ప్రాంతాన్ని సందర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి ఎస్ రాధాకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, టి రాముడు, కె.వి నారాయణ, ఎండి అంజిబాబు, కర్నూలు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ ఉన్నారు.

## ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

**- మే 12వ తేది నుండి మే 20వ తేది వరకు సప్లిమెంటరీ పరీక్షలు**
**- మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు వ్రాయనున్న 10,779 మంది విద్యార్థులు**
**- ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న 3325 మంది విద్యార్థులు**
**- 42 పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ**
**- జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్ లో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఐఓ సునీత, డిఈసి మెంబెర్స్ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12వ తేది నుంచి 20వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉ.9.గం.ల నుండి మ.12.గం.ల వరకు మొదటి సంవత్సర పరీక్షలు, మ.2:30.గం.ల నుండి సా.5:30 గం.లకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరంకు సంబంధించి జనరల్ విభాగంలో 10,192 మంది, వొకేషనల్ 587 మొత్తంగా 10,779 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ విభాగంలో 2,959 మంది, వొకేషనల్ 366 మొత్తంగా 3325 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడం జరుగుతుందన్నారు. సప్లిమెంటరీ పరీక్షలను 42 పరీక్షా కేంద్రాల్లో (ప్రభుత్వ జూనియర్ కళాశాల-19, ఏపి మోడల్ స్కూల్స్-2, ప్రైవేటు అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలు-19) నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు వైద్యశాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఆశా, ఎఎన్ఎంలతో మెడికల్ కిట్స్ ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందిని డిఆర్ఓ ఆదేశించారు. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్స్ మూసి ఉంచేలా చూడాలన్నారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. సున్నిత/సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా పూర్తి అయిన తర్వాత పరీక్షా పత్రాలను ఎప్పటికపుడు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం పరిశీలన



మన గళం,కర్నూలు లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని దిశ ఒన్ స్టాప్ కేంద్రం , మహిళాప్రాంగణాన్ని (శక్తి సదన్) తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి ,వాటిని సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు అనంతరం అక్కడ వున్న వారికి ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే 15100 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామన్నారు. ప్రాంగణంలో సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడ ఉన్నవారు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సదస్సులో పాల్గొన్న వారికి లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అందరూ అర్హులని తెలిపారు. వన్ స్టాప్ సెంటర్ నందు ప్రభుత్వం ద్వారా అందజేసే బాధితుల పరిహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ ,మహిళా ప్రాంగణం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వీరజవాన్ కుటుంబానికి అండగా ఉంటాం







**- లంబాడి హాక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్**

మన గళం,కర్నూలు సిటి : ఇండియా పాకిస్థాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్ చిత్ర పటానికి లంబాడి హాక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్ నివాళులు అర్పించారు. కర్నూలు లోని బిర్లా కాంపౌండ్ లో ఉన్న లంబాడి హాక్కుల పోరాట సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈకార్యక్రమం లో సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పుట్టగుండ్లపల్లి తాండా కు చెందిన జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. దేశం కోసం వీరమరణం పొందిన జవాన్ ఆత్మ కు శాంతి కలగాలని కైలాష్ నాయక్ కోరారు. మృతి చెందిన వీర జవాన్ కుటుంబానికి దేవుడు దైర్యం కల్పించాలని కోరారు. పుట్టగుండ్లపల్లి తాండా కు చెందిన శ్రీరామ్ నాయక్ కు మురళీ నాయక్ ఒకరే సంతానం అని కైలాష్ నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో నాగరాజు నాయక్, రామాంజనేయులు నాయక్,శంకర్ నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

మరో సామాజిక విప్లవం

చరిత్ర అన్ని వేళలా ఒకేలా ఉండదు, కాలమాన పరిస్థితులకు తగ్గట్లు మారుతూ ఉంటుంది. కారల్ మార్క్ చెప్పినట్లు చరిత్ర అంటే వర్గ పోరాటమే. 19వ శతాబ్దంలో సాంఘిక సంస్కరణ ఉద్యమం, 20 శతాబ్దంలో జాతీయ స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, ప్రస్తుతం 21వ శతాబ్దంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సరియైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనగణనలో కులగణనకై ఉద్యమం. ఇలా ఆయా కాలాల్లో ఆయా ఉద్యమాలు సమాజంపై ప్రభావాన్ని చూపుతూ చరిత్రగా నిలిచిపోయాయి. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. 1931 జనాభా లెక్కల నేపథ్యంలో జనగణనలో కులగణన చేయాలనే ప్రతిపాదన 1951 జనాభా లెక్కల సందర్భంగా ముందుకొచ్చినప్పటికీ కేవలం ఎస్సి, ఎస్టిల జనాభాను మాత్రమే లెక్కించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. మొదటి బిపి కమిషన్ కాక కాళేశ్వర్ కమిషన్ సందర్భంగా, రెండవ బిసి కమిషన్ మండల కమిషన్ సందర్భంగా జనగణనలో కులగణన చర్చకు వచ్చింది. అయినా కేంద్రం ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జనగణనలో కులగణన డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది. జనగణనలో కులగణనకై డిమాండ్ ఎన్నిసార్లు ముందుకొచ్చినా కేంద్రం మాత్రం జనగణనలో కులగణన వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. భాషా ప్రయోక్త రాష్ట్రాల విషయంలో కూడా ఈ రకమైన అభిప్రాయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో భాష ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. 70 సంవత్సరాల భాష ప్రయోక్త రాష్ట్రాల చరిత్రలు దేశాన్ని విచ్ఛిన్నం చేయగల అనైక్యత ఎక్కడా సంభవించలేదని చెప్పవచ్చు.

అంటే ఒక విషయంపై మనలో చాలా కాలంగా గూడుకట్టుకున్న ఆలోచనలు వాస్తవం కాదని తేలిపోయింది. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ వచ్చినప్పుడల్లా తోసిపుచ్చిన చరిత్ర కాంగ్రె పార్టీదే.అయినప్పటికీ 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, కులగణన చేయడం జనగణనలో కులగణనకు మొదటిమెట్టుగా చెప్పవచ్చు. ఎన్డిఎ ప్రభుత్వం జనగణనలో కులగణనను వ్యతిరేకించినప్పటికీ ప్రస్తుతం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం. అయితే ఈ ఘనత మాత్రం దేశవ్యాప్తంగా ఈ వాదాన్ని చర్చకు తెచ్చిన కాంగ్రెస్ పార్టీది, ఆయా రాష్ట్రాల్లో జనగణనలో కులగణనకై డిమాండ్ చేసిన డిఎంకె, ఎస్పి, ఆర్జెడి లాంటి ప్రాంతీయ పార్టీలది. కులగణన చేయడమే కాదు, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదే. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణనకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణనకు వాగ్దానం చేయడం, రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించడం, బిసి సంఘాల ఒత్తిడి నేపథ్యంలో కులగణన జరగడం, విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకై శాసనసభ చట్టం చేస్తూ కేంద్రానికి పంపడం చకచగా జరిగిపోయాయి. 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం బిసి సంఘాలు ఢిల్లీలో 'జంతర్ మంతర్' వద్ద డిమాండ్ చేయడంతో కులగణనపై కేంద్రం ఆలోచనలో మార్పు వచ్చిండోచ్చు. కర్ణాటక, తెలంగాణ తోపాటు బీహార్ లాంటి రాష్ట్రాలు కులగణన పూర్తి చేయడం దేశంలో చాలా రాష్ట్రాల్లో కులగణనకై డిమాండ్లు వినిపించడంతో ఒక్కసారిగా కేంద్రం పునరాలోచనలోపడి ఉండవచ్చు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చివరి ఉపన్యాసంలో మాట్లాడిన మాటలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపి ఉండవచ్చు. 'ఒక వ్యక్తికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా 26 జనవరి 1950 నుంచి మనం రాజకీయ సమానత్వంలోకి అడుగు పెట్టబోతున్నాం. కానీ కొన్ని వందల సంవత్సరాలుగా మన దేశంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు మన సమాజంలో సామాజిక, ఆర్థికంగా సమానత్వం సాధించుటకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. రానున్న ప్రభుత్వాలు ఆ ప్రతిబంధకాలను తొలగిస్తూ సామాజిక, ఆర్థిక సమానత్వానికై ప్రయత్నించాలి. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించనినాడు పీడిత ప్రజలు ఈ రాజ్యాంగ సభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు అని హెచ్చరించారు. ఈ 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ వర్గాలైన బిపి ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం చేకూర లేదనే చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా రాజకీయ సమానత్వం ఉన్నట్లు కనబడిన, ఆర్థిక అసమానతలు, ఓటు హక్కును నిజాయితీగా ఉపయోగించుకోలేని పరిస్థితుల వల్ల అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం గల రాజకీయ సమానత్వం ఇప్పటికీ సాధ్యం కాలేదు. దీనికి తోడు రాత్రికి రాత్రి ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చిన కేంద్రంపై దేశవ్యాప్తంగా బిసిలందరూ అసంతృప్తితో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ తగ్గడం, రానున్న బీహార్, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో జనగణనలో కులగణననే ప్రధాన ప్రచారాంశంగా ఉండడంతో కేంద్రం ఆలోచన మారి ఉండవచ్చు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించాలంటే దేశవ్యాప్తంగా డిమాండ్‌గా వస్తున్న జనగణనలో కులగణన ఒక్కడే పరిష్కార మార్గంగా కేంద్రం భావించి ఉండవచ్చు. జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఇల్లు అలుకగానే పండుగా కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడి సంబరపడిపోకూడదు. రానున్న జనగణనలో కులగణనకై కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్గదర్శకాలను బిసి సమాజం నిశితంగా గమనించాలి. జనగణనలో కులగణన చేస్తే సరిపోదు. కులగణన రిపోర్టు కనుగుణంగా మండల కమిషన్ సూచించిన 40 సిఫారసులను అమలు చేయాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే జనగణనలో కులగణన చేపట్టినదానికి సార్ధకత చేకూరుతుంది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది.

# తెలుగుదేశం ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

- సిపిఎం పార్టీ నాయకురాలు వేణమ్మ.




మన గళం,కర్నూలు రూరల్ : తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ గారు రైతులకు రాష్ట్ర ప్రజలకు స్మార్ట్ మీటర్లను పగల గొట్టండి, స్మార్ట్ మీటర్ల ద్వారా కరెంట్ బిల్లులు పెరుగుతాయి ప్రజలు నష్టపోతారని ప్రచారం చేశారని అదే పని ఈరోజు మేము సిపిఎం పార్టీగా ప్రజలను చైతన్యం చేస్తున్నామని జొహరాపురం 18.వ వార్డు లో సిపిఎం పార్టీ మహిళా నాయకురాలు వేనమ్మ, అమీనాభి, కమ్రు న్ బీ,రాధ లు ఇంటింటికి ప్రజల దగ్గరకు వెళ్లి స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలకు జరిగే నష్టాన్ని తెలియజేస్తూ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి కరెంట్ బిల్లులు తగ్గించాలని నినాదాలున్న పోస్టర్లు ప్రజల ఇంటికి అతికించడం జరిగింది,ఈ కార్యక్రమం లో వారు ప్రజలతో మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలకు పని లేక సరైన కూలీ లేక ఇబ్బంది పడుతున్న సందర్భంలో గత ప్రభుత్వం చేసిన అదానితో లంచాలు తీసుకోని ఓపందాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రజల దగ్గర నుండి అనేక రకాల కరెంటు బిల్లులను సర్చార్జీల పేరుతో వసూలు చేయడం బాధాకరమ న్నారు, ఇప్పటికే సామాన్య ప్రజలు పనులు దొరకక కరువుతో అల్లాడుతూ అర్ధాకలతో బ్రతుకుతుండగా, ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సాయ సహకారాలు అందించకుండా మరియు వారు ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా, నిరుద్యోగ సమస్యను పరిష్కరించ కుండా ప్రతి ఇంటి నుండి ఒకరిని పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తామని ఇచ్చిన మాటను పక్కనపెట్టి కార్పొరేట్ పెట్టుబడిదారుల ఆదాయం పెరిగే రకంగా భూమిని నీళ్లను కరెంటును బ్యాంకుల నుండి సబ్సిడీ రుణాలను వారికి అప్పజెప్పడం వలన రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా నష్టపోతు బతకలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు, వారిని ఆదుకో వలసిన బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు, రాష్ట్రాన్ని సమానంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన తెలుగు దేశ ప్రభుత్వం మరోసారి అమరావతికి మోడీని తీసుకొచ్చి పవన్ కళ్యాణ్ కు చాక్లెట్ ఇప్పించారని గతంలో చెంబు నీళ్లు, పిడికెడు మట్టి ఇచ్చి పదేళ్లు మోసం చేశారని ఇప్పుడు చాక్లెట్ తో ఇంకెంతకాలం మోసం చేస్తారని వారు విమర్శించారు, రాష్ట్రంలో మహిళల పైన హత్యలు అత్యాచారాలు జరుగుతున్న మహిళా హొం శాఖ మంత్రి ఉన్న రక్షణ లేకపోవడం మహిళల పట్ల ఈ ప్రభుత్వ పరిస్థితి అర్థమవుతుందని అన్నారు, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల ఆదాయం పెరిగే పద్ధతులను అవలంబించకుండా కరెంట్ బిల్లులు పెంచే విధంగా గత వైసిపి ప్రభుత్వం అదానితో చేసుకున్న సఖి ఒప్పందాన్ని రద్దుచేసి పాత విధంగానే కరెంటు బిల్లులు, కరెంటు మీటర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు, లేని పక్షాన ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె

మన గళం,కర్నూలు రాజవిహార్ : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కర్నూలులో సిబ్బంది నిరసన దీక్షలు చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 15 సంవత్సరాలు దాటిన కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. హెచ్.ఆర్. పాలసీ అమలు చేయాలని వారు కోరారు. విధి నిర్వహనలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించ కుంటే విధులు బహిస్కరిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమం లోవెంకటేశ్వర్లు,మనోహర్, సమీర్ బాష, జహంగీర్ బేగ్, లక్ష్మణ్ స్వామి, హర్ష, మురళి, సలీం ,తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ కార్పొరేషన్ లోన్లు అప్లై చేసుకోవడానికి గడువు పెంచాలి

- ఏఐవైఎఫ్,డి హెచ్ పి ఎస్ నేతల డిమాండ్



మన గళం,కర్నూలు సిటి : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ అభ్యర్థులకి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం బ్యాంకు లికుడ్ రుణాల కోసం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఆన్ లైన్ లో అప్లై చేసుకోవడానికి మే 10 వ తేదీ చివరి తేదీ ఉండగా గత రెండు రోజుల నుండి సర్వర్ పనిచేయకపోవడం రేపు చివరి రోజు సెలవు దినం కావడంతో చాలామంది అభ్యర్థులు నష్టపోతున్నారని అప్లై చేసుకోవడానికి గడవు పొడిగించాలని ఏఐవైఎఫ్, డిహెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు , నగర అధ్యక్షులు నాగరాజు , డిహెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ , నగరనాయకులు దావీదు లు పాల్గొన్నారు . ఈ సందర్భంగా శ్రీనివాసులు మహేష్ లు మాట్లాడుతూ దాదాపు 2018 నుండి ఇప్పటివరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయలేదని దాదాపు 8 సంవత్సరాల తర్వాత ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ ప్రజలకి స్వయం ఉపాధి కోసం బ్యాంకు లికుడ్ రుణాలకు నోటిఫికేషన్ ఇచ్చి మే 10 వ తేదీన చివరి గడువు పెట్టడం జరిగిందని అయితే గత రెండు రోజుల నుండి సర్వర్ పనిచేయకపోవడంతో మే 10 వ తేదీ రెండవ శనివారం సెలవు దినం కావడంతో చాలామంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెంత ఉన్నారని కావున రాష్ట్ర ప్రభుత్వ స్పందించి అప్లై చేసుకోవడానికి గడువు పొడిగించడంతోపాటు అప్లై చేసిన ప్రతి అభ్యర్థికి లోన్ మంజూరు చేసి ఎస్సీ ప్రజల అభ్యున్నతికి పాటుపడాలని వారి డిమాండ్ చేశారు అదేవిధంగా లోన్ మంజూరు చేసే విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా నిజమైన అర్హులకే అందే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

# పారిశుద్ధ్య యంత్రసామాగ్రి వినియోగం





మనగళం శ్రీశైలం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నిన్నటి రోజున (08.05.2025) పారిశుద్ధ్య విభాగంలో వినియోగించేందుకు ఒక ఆటోను మరియు పారిశుద్ధ్య యంత్రసామాగ్రిని విరాళంగా అందజేశారు. వీటి విలువ రూ. 6,06,500/- లని స్థానిక బ్యాంకు అధికారులు తెలియజేశారు. క్షేత్రపరిధిలో ఫాగింగు చేసేందుకుగాను రూ.3.10 లక్షలు విలువ గల ఆపి ఎక్స్ట్రా క్లాసిక్ ఆటోను, క్యూకంపార్టుమెంట్ నందు భక్తులు వేచి వుండే గదులను శుభ్రపరిచేందుకు రూ.1 లక్ష విలువగల స్క్రబ్బింగ్ అండ్ డ్రైయింగ్ మిషన్ను, చెత్తాచెదారాలను, వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు రూ. 1.65 విలువగల లిట్టర్ పిక్కర్ మిషన్ను, మరియు పార్కింగ్ ప్రదేశాలు మొదలైనచోట్ల వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు రూ.31,500 విలువగల వ్యాక్యూమ్ క్లీనర్లను వీరు అందజేయడం జరిగింది. కాగా ఈ రోజు నుంచి ఈ సామాగ్రి వినియోగాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణములో పిక్కర్ మిషన్ మరియు వ్యాక్యూమ్ మిషన్ పనితీరును కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పి. మురళీ బాలకృష్ణ, పారిశుద్ధ్య విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డి, పారిశుద్ధ్యపు విభాగపు పర్యవేక్షకులు డి. రాధాకృష్ణ, సంబంధిత గుమాస్తా ఎమ్. కార్తీక్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (09.05.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# మాదకద్రవ్యాల నియంత్రణపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి

**- మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టండి - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : భారత ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు నషా ముక్త్ భారత్ అభియాన్ అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఈ మేరకు మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు బానిస కాకుండా సంపూర్ణ అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయిజ్ ఫాతిమా, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్, డిఈఓ జనార్ధన్ రెడ్డి, డిఐఓ సునీత, ఐసిడిఎస్ పిడి లీలావతి, జువైనల్ హెూం సూపరింటెండెంట్ హుస్సేన్ భాష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ దేశంలో మత్తు పదార్థాల నివారణకు భారత ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ అనే కార్యక్రమాన్ని 2020లో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ మేరకు మాదకద్రవ్యాల నివారణకు సంబంధిత అధికారుల నుండి నివేదికలు సేకరించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. అదే విధంగా పాఠశాల, కళాశాలలు, విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వ్యసనాలకు బానిసైతే కలిగే దుష్ప్రభావాలపై వీడియోలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జన సమూహ ముఖ్య కూడలి ప్రాంతాలలో హెూర్డింగులు ఏర్పాటుతో పాటు, వాల్ పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. కళాజాత బృందాల ద్వారా మత్తు పదార్థాల నియంత్రణకు అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కరపత్రాలు కళాశాలలోని ఆడిటోరియం, క్యాంటీన్, లైబ్రరీలలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక బృందాలను భాగస్వామ్యం చేసి మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల నివారణ కోసం జూన్ 1వ తేది నుండి జూన్ 26వ తేది వరకు సంబంధిత అధికారులు బృందాలుగా వెళ్లి నిర్దేశించిన కార్యక్రమాలను చేపట్టి అవగాహన తీసుకురావాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకుగాను వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. బలహీన వర్గాల కాలనీల్లో తల్లిదండ్రులు మద్యం సేవిస్తే పిల్లలపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏ మత్తు పదార్థం సేవిస్తే ఎలాంటి దుష్ప్రభావాలు, అనారోగ్యాలు కలుగుతాయో అన్న అంశాలపై అవగాహన తీసుకురావాలన్నారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25లో చేర్చాల్సిన అంశాలపై డిఈఓ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్, ఐసిడిఎస్ పిడి, జువైనల్ హెూం సూపరింటెండెంట్, డిఆర్డిఎ కోఆర్డినేటర్, డిఐఓ, మెప్మా, వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్ కు వివరించారు.

# పారిశుద్ధ్య కార్యక్రమం



మనగళం శ్రీశైలం : స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమములో భాగంగా ఈరోజు (08.05.2025) క్షేత్ర పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించబడింది. ప్రతీ గురువారము క్షేత్రపరిధిలో ఈ విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోంది.ఈ రోజు జరిగిన స్వచ్ఛాంధ్ర సేవాకార్యక్రమములో క్షేత్రంలోని పలు ప్రదేశాలలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేయడం జరిగింది. క్షేత్రంలోని పలు ప్రధాన రహదారులు, ఆరుబయలు ప్రదేశాలు మొదలైనచోట్ల ఈ పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించబడింది. కాగా పారిశుద్ధ్య నిర్వహణకుగాను క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించడం జరిగింది. పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ జోనుకు కూడా దేవస్థానం యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగింది. అదేవిధంగా ఆయా జోన్లలో పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. దాదాపు అన్ని విభాగాల సిబ్బంది కూడా ఈ ప్రత్యేక విధులను కేటాయించడం జరిగింది. ఈ రోజు జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా భద్రతాచర్యలు





మనగళం శ్రీశైలం : దేవస్థానం పరిధిలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు భద్రతా విభాగాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ అన్నిచోట్ల కూడా భద్రతా తనిఖీలు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. భద్రతా చర్యలలో పోలీస్ శాఖవారి పూర్తి సహాయ సహకారాలు పొందాలని భద్రతా విభాగపు పర్యవేక్షకులకు సూచించారు. ముఖ్యంగా దేవస్థానం టోల్గేట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. అదేవిధంగా క్యూకాంప్లెక్సు, క్యూలైన్ల ప్రవేశద్వారం, ప్రధానాలయం, క్షేత్రపరిధిలోని జనసమ్మర్థ ప్రదేశాలు, సాక్షిగణపతి, హఠకేశ్వరం, పాలధార పంచదార, శిఖరేశ్వరం మొదలైన చోట్ల కూడా భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కంట్రోల్ రూము సిబ్బందికూడా జాగరూకతతో అన్ని ప్రాంతాలను పరిశీలిస్తూ, ఆయా ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందికి తగు సూచనలు ఇస్తుండాలన్నారు. క్షేత్రపరిధిలోని ఆయా ప్రదేశాలన్నీ ప్రస్ఫుటంగా కనపడేవిధంగా సీసీ కెమెరాల నిఘాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని కూడా కార్యనిర్వహణాధికారివారు ఆదేశించారు. కాగా భద్రతా చర్యలలో భాగంగా ఈ రోజు (09.05,2025) ఉదయం నుంచే దేవస్థానం టోల్ గేట్ వద్ద భద్రతా చర్యలు మరింత పకడ్బందీగా చేపట్టబడ్డాయి. శ్రీశైలక్షేత్రానికి వచ్చే ప్రతీ వాహనాన్ని కూడా భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతోంది. ఇటీవల దేవస్థాన భద్రతా సిబ్బందికి అయిదురోజులపాటు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. భద్రతా విషయమై సిబ్బందికి మరింత అవగాహన కలిగించేందుకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయవలసినదిగా జిల్లా పోలీస్ శాఖ వారిని దేవస్థానం కోరడం జరిగింది. తదనుగుణంగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా మరియు ఆత్మకూరు డీఎస్పీ శ్రీ ఆర్.రామాంజీనాయక్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖవారు ఈ శిక్షణా కార్యక్రమంలో సిబ్బందికి అవగాహనను కల్పించారు. దేవస్థానంలో విధులు నిర్వహించే మొత్తం భద్రతా సిబ్బందిని రెండు బృందాలుగా విభజించి ఈ శిక్షణను ఇవ్వడం జరిగింది. శిక్షణా కార్యక్రమములో క్యూలైన్ల నిర్వహణ, ఉత్సవాల సమయాలలో రోప్ పార్టీ విధులు, పెట్రోలింగ్ చేసే విధానం, వైద్యపరంగా అత్యవసర పరిస్థితులలో ( మెడికల్ ఎమర్జెన్సీ సమయాలలో చేయాల్సిన ప్రథమచికిత్స సీసీ కెమెరాల సర్వేలెన్స్, అగ్నిమాపక పరికరాల వినియోగం, ఇన్సిడెంట్ రిపోర్టింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అమరవీరుడికి సీఎం ఘన నివాళి





మన గళం,ఓర్వకల్లు : కర్నూలు ఎయిర్ పోర్ట్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుడు, సైనికుడు మురళీ నాయక్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళులు అర్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాండ పంచాయతీకి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ముఖ్యమంత్రి ప్రార్థిస్తూ, వారి చిత్రపటం ముందు పుష్పగుచ్ఛాన్ని ఉంచి, ఘనంగా నివాళులు అర్పించారు.

# నందీశ్వరస్వామివారికి విశేషపూజలు

మనగళం శ్రీశైలం : ఈ రోజు (09.05.2025) మధ్యాహ్నానికి త్రయోదశి ఘడియలు రావడంతో నందీశ్వరస్వామి వారికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించబడుతుంది. ప్రతీ మంగళవారం రోజున మరియు త్రయోదశిరోజులలో దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. అయితే ప్రతి నెలలో కూడా త్రయోదశి రోజులలో అనగా శుద్ధ త్రయోదశి మరియు బహుళ త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వరస్వామివారి పూజను పరోక్షసేవగా జరిపించుకునే అవకాశం కూడా కల్పించబడింది. కాగా ఈ రోజు మొత్తం 17 మంది భక్తులు పరోక్షసేవగా ఈ నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకుంటున్నారు.. ఈ పరోక్షసేవలో తెలుగురాష్ట్రాల నుంచేకాకుండా మహారాష్ట్ర, ఒడిస్సా నుంచి కూడా భక్తులు ఈ విశేషపూజను నిర్వహించుకుంటున్నారు. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది.

చెల్లింపు చేయవచ్చు.

నందీశ్వరస్వామివారి ఆరాధన వలన సంతానంలేనివారికి సంతానం కలుగుతుందని, సమస్యలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని, ఋణబాధలు తీరుతాయని, అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, కష్టాలు నివారించబడతాయని, మానసిక ప్రశాంతత



చేకూరుతుందని పండితులు పేర్కొంటున్నారు.

అదేవిధంగా ఈ స్వామికి నానబెట్టినశనగలను సమర్పించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. అందుకే ఈ స్వామివారికి శనగలబసవన్న అనే పేరు కూడా ప్రసిద్ధంగా ఉంది. ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతున్నది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును.



# కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో మొక్కజొన్న మిషన్లో పడి రైతు మృతి

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో విషాద సంఘటన చోటుచేసుకుంది తన పొలంలో పండిన మొక్కజొన్న పంటను శుక్రవారం పొలంలో బెల్లం చిన్న గిడ్డయ్య అనే రైతు మొక్కజొన్న పంటను మొక్కజొన్న మిషన్లో వేస్తుండగా అకస్మాత్తుగా మిషన్లో ఇరుక్కుపోయి బోయ బెల్లం చిన్న గడ్డయ్య అనే రైతు మృతి చెందాడు స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం తమ సొంత పొలంలో పండించిన మొక్కజొన్న పంటను మిషన్ ద్వారా కోస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్లో ఇరుక్కుపోయాడు అని వారు తెలిపారు గమనించిన తోటి రైతులు అతి కష్టం మీద చిన్న గిడ్డయ్యను బయటకు తీసి చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు



# మొక్కలునాటే కార్యక్రమం





మనగళం శ్రీశైలం : పర్యావరణ పరిరక్షణకు మరియు క్షేత్రాన్ని మరింతగా సుందరీకరించేందుకు శ్రీశైల క్షేత్ర పరిధిలో పలుచోట్ల మరిన్ని మొక్కలు నాటబడుతున్నాయి. ఈ కార్యక్రమములో భాగంగా దేవస్థానం పరిధిలో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమము చేపట్టబడింది. ఈ రోజు (08.05.2025) సాయంకాలం విభూతిమఠం రుద్రాక్షమఠం పరిసర ప్రాంతాలలో జరిగిన ఈ మొక్కలు నాటే కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పి. మురళీబాలకృష్ణ మరియు ఉద్యానవన విభాగపు అధికారులు పాల్గొన్నారు. తరువాత కార్యనిర్వహణాధికారి సంబంధిత అధికారులతో కలిసి భ్రామరీపుష్పవనం, రుద్రవనం (రుద్రాపార్కు), మల్లమ్మతోటను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ రాబోవు వర్షాకాలం ముగిసేలోగా క్షేత్రంలో కనీసం 3వేల మొక్కలు నాటేవిధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా దేవతావృక్షాలు, నీడనిచ్చే మొక్కలు, పూలచెట్లు, పలుఫలజాతులు, సుందరీకరణ మొక్కలు ఆయా ప్రదేశాలలో నాటేవిధంగా సమగ్రంగా తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉద్యానవనవిభాగాన్ని ఆదేశించారు. మొక్కలు నాటిన తరువాత వాటి సంరక్షణకు కూడా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం మొక్కలలో 30శాతం మేరకు దేవతావృక్షాలను నాటాలన్నారు. దేవతా వృక్షాలలో బిల్వం, కదంబం, రుద్రాక్ష, తెల్లమద్ది, ఉసిరి, రావి, వేప మొదలైన వృక్షాలను ఎక్కువగా నాటాలని సూచించారు. ఎక్కువగా పలు పార్కింగ్ ప్రదేశాలు, ఆరుబయలు ప్రదేశాలలో నీడనిచ్చే చెట్లను నాటాలన్నారు. వలయరహదారికి ఇరువైపులా కూడా మరిన్ని నీడనిచ్చేమొక్కలను నాటాలన్నారు. అదేవిధంగా క్షేత్రపరిధిలోని పలు ఉద్యానవనాలలో మరిన్ని వృక్షజాతులను, పండ్ల మొక్కలను నాటాలన్నారు. ముఖ్యంగా శ్రీస్వామిఅమ్మవార్ల కైంకార్యాలకు వినియోగించే పూల మొక్కలను అధికసంఖ్యలో నాటాలన్నారు. అలాగే క్షేత్రపరిధిలో బిల్వం మొక్కలను విస్తృతంగా పెంచాలన్నారు. ఆలయంలో మామిడితోరణాలకు వినియోగించేందుకుగాను క్షేత్రంలో వీలైనంత ఎక్కువగా మామిడిమొక్కలను కూడా నాటాలని ఆదేశించారు. ఇంకా వారు మాట్లాడుతూ రుద్రపార్కులో ఏకశిలావిగ్రహం ఎదురుగా నందివిగ్రహాన్ని నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం ఉద్యానవనాలలో చిన్నపిల్లలు ఆడుకునేందుకు మరిన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అదేవిధంగా పూర్వపురోజులలో వినియోగించే తిరగలి, రోకలి, దంపుడురోలు, రుబ్బురోలు, కవ్వం మొదలైన గృహోపకరణాల నమూనాలను రుద్రాపార్కులో ఏర్పాటు చేయాలన్నారు. దీనివలన మన పూర్వపు జీవనవిధానాలపై చిన్నపిల్లలలో అవగాహన కలుగుతుందన్నారు. మల్లమ్మతోటలో మల్లెలు, కనకాంబరం, సుగంధాలు (లిల్లీలు) మొదలైన మరిన్ని పూల మొక్కలను పెంచాలన్నారు. అదేవిధంగా మల్లమ్మతోటలోని మల్లమ్మమండపంచుట్టూ కటాంజనం ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాగా ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పి. మురళీబాలకృష్ణతో పాటు ఉద్యానవన విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ జి.ఈశ్వరరెడ్డి, హార్టికల్చరర్ అధికారి ఎస్. లోకేష్, ఉద్యానవనశాఖ సిబ్బంది పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



## ప్రొఫెసర్ ఎన్ టి కే నాయక్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలి.




మన గళం,కర్నూలు రూరల్ : రాయలసీమ విద్యాలయంలో పనిచేస్తున్నటువంటి ప్రొఫెసర్ రెక్టారు ఎన్.టి.కె. నాయక్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి-కుల- ప్రజా-మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు శేషఫణి, పట్నం రాజేశ్వరి, నక్కలమిట్ట శ్రీనివాసులు, ఖధీరుల్లా, సీమకృష్ణ, వెంపేంట రాంబాబు,భరత్ కుమార్ ఆచారి,నంది విజయలక్ష్మీ , పెరుగు శివకృష్ణ, కరుణాకర్, నాగభూషణం లు డిమాండ్ చేస్తూ వైస్ ఛాన్సలర్ డాక్టరు వెంకట బసవరావు,రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు లకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యాలయ కేంద్రంగా కాకుండా అక్రమార్కులకు అవినీతిపరులకు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారడం బాధాకరం అని వారు తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి తలమానికంగా నిలిచిన రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి నోచుకోక పోవడం శోచనీయమని వారు అన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా, ఇంఛార్జి వైస్ ఛాన్సలర్ గా పనిచేసి ప్రస్తుతం రెక్టారుగా పనిచేస్తున్న ఎన్.టి.కె. నాయక్ అవినీతి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా, రోస్టర్ అమలు చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఉద్యోగాల భర్తీ చేసుకుని తనకంటూ ఒక కోటరీ ఏర్పాటు చేసుకుని నియంతలా యూనివర్సిటీలో చలామణీ అవుతున్నాడని వారు తెలిపారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయిస్తూ భయబ్రాంతులకు గురి చేస్తు తనకు తిరుగు లేకుండా చేసుకున్నాడని వారు అన్నారు. ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్ పై సి.బి.సి.ఐ.డి. వారు మరియు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వారు విచారణ జరిపి అవినీతికి పాల్పడినది వాస్తవమని ఉన్నత విద్యా మండలి వారికి నివేదిక అందజేస్తూ చర్యలకు సిఫారసు చేశారు.ఉన్నత విద్యా మండలి వారు ఎన్.టి.కె. నాయక్ అవినీతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంఎన్.టి.కె. నాయక్ పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని అడిషనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ పోలీసు వారికి ఎండార్స్మెంట్ పంపించడం జరిగింది అని వారు తెలిపారు.అయితే గత ప్రభుత్వ అండతో ఎన్.టి.కె. నాయక్ అన్నీ తొక్కి పెట్టించు కున్నాడు కానీ యూనివర్సిటీ పాలకమండలి ఎన్.టి.కె.నాయక్ కు రెండు ఇంక్రిమెంట్స్ కట్ చేసి అడ్మినిస్ట్రేషన్ పరంగా,ఆర్థికపరంగా ఏలాంటి అధికారి పదవులు లేకుండా ప్రొఫెసర్ గా (రెక్టారు) మాత్రమే అవకాశం ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తీర్మానం చేశారని వారు అన్నారు.ఎన్ టి కే నాయక్ అవినీతి అంతా ఇంతా కాదు కొన్ని కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారని, యూనివర్సిటీ భూములు సుమారు 150 ఎకరాలు కూడా గత ప్రభుత్వ రాజకీయ నాయకులకు అప్పనంగా కట్టబెట్టారని వారు తెలిపారు. ఎన్.టి.కె. నాయక్ చేసిన అవినీతి అక్రమాల పై చర్యలు చేపట్టాలని లేని పక్షంలో యూనివర్సిటీ ముందు ప్రజా కుల సంఘాలు పోరాటం చేయాల్సి వస్తుందని వారు తెలుపుతూ రాయలసీమ విశ్వవిద్యాలయం ఉద్యోగులతో కలిసి ఉపకులపతి గారికి, రిజిస్ట్రార్ గారికి వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది.

## వివాహ వేడుకలో పాల్గొన్న కోడుమూరు అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ మీసాల ప్రేమ్ కుమార్



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని శ్రీరాముల దేవాలయంలో గల కల్యాణమండపంలో రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ సభ్యులు శ్రీ తాయప్ప గారి పెద్ద కుమారుడు %=ూూ% సంఘ సభ్యులు వీరేష్ గారి వివాహంలో పాల్గొని నవదంపతులకు శుభాకాంక్షలు తెలిపిన భారతీయ జనతా పార్టీ కోడుమూరు నియోజకవర్గం కన్వీనర్ మీసాల ప్రేమ్ కుమార్ గారు రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ కృష్ణగారు కోడుమూరు మాజీ మండల అధ్యక్షులు శ్రీరామ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సల్వాడి సురేంద్ర రాష్ట్ర ఓబీసీ సెక్రటరి మురళి నాయుడు చేనేత కమిటీ సభ్యులు లక్ష్మణ్ గారు మరియు సభ్యులు నటరాజ్ గారు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కెడిసిసి ఛైర్మెన్ గా నియమితులైన డి విష్ణువర్ధన్‌రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసిన నవీన్ కుమార్



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా సీనియర్ తెలుగుదేశం నాయకుడు శ్రీ.డి. విష్ణు వర్ధన్ రెడ్డి గారు కర్నూలు జిల్లా కెడిసిసి ఛైర్మెన్ గా నియమితులైన శుభ సందర్భంలో డి ఎఫ్ సి ఎస్ చైర్మన్ బి ఎస్ నవీన్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్ప గుచ్చాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు అనంతరం కోడుమూరు ఎంఎల్ఏ బొగ్గుల దస్తగిరి గారితో కలిసి పలు విషయాలపై చర్చించి కెడిసిసి పరిధిలో మత్స్యకారులకు డైరెక్టర్ స్థానాలను కేటాయించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గారిని కోరారు

## సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట

**- ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై వర్క్ షాప్**



మన గళం,కర్నూలు క్రైం : సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట వేస్తామని కర్నూలు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు.నేరస్థులు తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్ష్యా ధారాల సేకరణ, వాటి భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలనే విషయంపై పోలీసు అధికారులు, దర్యాప్తు అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి , ఆంధ్రప్రదేశ్ డిజిపి గారుల ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై వర్క్ షాప్ నిర్వహించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల అధికారులు, దర్యాప్తు అధికారులు, స్టేషన్ రైటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగిస్తున్న నేపథ్యంలో వారిని ఎదుర్కొనేందుకు పోలీసులు అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు మాట్లాడారు. సాక్షులు రాజీ అయినా కూడా నిందితులకు సైంటిఫిక్ ఎవిడెన్స్ తో శిక్షలు పడేవిధంగా చేయడమే ఈ కార్యక్రమమని తెలిపారు. పోలీసు అధికారులకు, దర్యాప్తు అధికారులకు, స్టేషన్ రైటర్లకు పలు విషయాల పై దిశా నిర్దేశం చేశారు. సందేహాలను నివృత్తి చేశారు.




హత్యలు, పోక్సో కేసులు, సైబర్ క్రైమ్ వంటి నేరాలు జరిగినప్పుడు దర్యాప్తులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఫోరెన్సిక్ సంబంధించి సాక్ష్యాలను ఏవిధంగా సేకరించాలనే విషయాల పై అవగాహన చేశారు. డిఎన్ఎ విశ్లేషణ , వేలిముద్రలు , రక్తపు మరకల నమూనాల లో సాక్ష్యాదారాలు సేకరించడం, కేసుల నమోదు , సంబంధిత ప్రోసిజర్ సీజ్ చేసిన సెల్ ఫోన్లు, మొబైల్ నెంబర్లు, సిసిటివి ఫుటేజి లు, సంఘటన ప్రాంతాలలో దొరికిన ప్రతి వస్తువులను, ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించేటప్పుడు ఆ పత్రాల పై అధికారుల సంతకాలు, స్టాంప్ ముద్ర సీళ్ళు, పకడ్బందీగా 48 గంటలలో పంపించాలని ఫోరెన్సిక్ నిపుణులు పోలీసు అధికారులకు , దర్యాప్తు అధికారులకు తెలియజేశారు. అనంతరం డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సరళాదేవి, ఎపిపి ఖాధర్ భాషా, డాక్టర్ రంగయ్య, డిఎస్పీలు ఫోరెన్సిక్ నిపుణులకు పోలీసు అధికారులు జ్ఞాపికలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరాతో పాటు డిఎస్పీలు బాబు ప్రసాద్ , శ్రీనివాసాచారి ,ఉపేంద్రబాబు, వెంకట్రామయ్య, రామాంజినాయక్ , ఫోరెన్సిక్ ఎక్స్ పర్ట్స్ లు డా.ఎస్. అసీంబాషా, డా. ఎం. కిశోర్ కుమార్ రెడ్డి, జి.శ్యాంప్రసాద్, కుమారస్వామి , జిజిహెచ్ డాక్టర్లు, పిపిలు, ఎపిపిలు, సిఐలు, ఎస్సైలు, ఫోరెన్సిక్ విభాగం మరియు ఫింగర్ ప్రింట్ సిబ్బంది పాల్గొన్నారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310